



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
PEN POWER TELUGU DAILY
ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 | సంచిక : 27 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | మంగళవారం 1 అక్టోబర్ 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# దసరాలోపు కొత్త టీచర్లు

## 11వేల 62 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ

- పది నెలల్లో 65 వేల కొలువుల భర్తీ: సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో 7,857 పోస్టులను మాత్రమే భర్తీ చేసిందని విమర్శ
- కాంగ్రెస్ 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగ నియామక పత్రాలను అందించిందని వెల్లడి
- తక్కువ సమయంలో డీఎస్సీ ఫలితాలు ఇచ్చామన్న ముఖ్యమంత్రి




**హైదరాబాద్ పెన్ పవర్:** దసరాలోపు కొత్త టీచర్ల నియామక ప్రక్రియను పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 11 వేల 62 టీచర్ పోస్టుల భర్తీలో భాగంగా నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను సీఎం ప్రకటించారు. 1:3 నిష్పత్తిలో ఫలితాలు విడుదల చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వం పదేండ్లు పాలించి కేవలం ఏడు వేల టీచర్ పోస్టులనే భర్తీ చేసిందని అన్నారు. తాము పది నెలల వ్యవధిలో 11 వేల 62 టీచర్ కొలువులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. కేవలం 56 రోజుల్లోనే రిజల్ట్ ప్రకటించామని గుర్తు చేశారు. అక్టోబర్ 9 న ఎల్బీ స్టేడియంలో డీఎస్సీకి ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తామని సీఎం చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన పది నెలల వ్యవధిలో 65 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వివరించారు. త్వరలోనే గ్రూప్%-%1 పలితాలు విడుదల చేయనున్నామని సీఎం చెప్పారు. ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అన్నారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారనే సాకుతో గత ప్రభుత్వం ఏకోపాధ్యాయ పాఠశాలలు మూసి వేసిందని, తాము వచ్చాక వాటిని తెరిపించామని అన్నారు. గ్రామీణ విద్యకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. గత ప్రభుత్వ హాయంలో పేరుకుపోయిన చెత్తనంతా ఊడ్చేస్తున్నామని వివరించారు.

**100 సెగ్మెంట్లలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు**

రాష్ట్రంలోని 100 సెగ్మెంట్ల పరిధిలో రూ. 12,500 కోట్లు వెచ్చించి నిర్మించనున్నామని చెప్పారు. ఇప్పుడున్న గురుకులాలు పిట్టగూళ్లలా ఉన్నాయని, వాటిని వర్సిటీల తరహాలో 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్, మధిరలో ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. గత ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వం గ్రూప్ 1,2,3 పోస్టులను అంగడి సరుకుల్లా మార్చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా సంస్కరిస్తున్నామని చెప్పారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణపై దృష్టి పెట్టామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఓ కమిటీ వేయనున్నట్టు సీఎం వెల్లడించారు

# అక్టోబర్ 3 నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సర్వే..

## ఒప్పుకుంటేనే ఫ్యామిలీ ఫొటో..

- రాష్ట్రవ్యాప్తంగా 238 ప్రాంతాల్లో అయిదు రోజుల పాటు సాగనున్న ప్రక్రియ
- పట్టణ, నగర ప్రాంతాల్లో జనాభా ఆధారంగా ఎక్కువ టీమ్‌లు
- కుటుంబం ఫొటో దిగడం ఆప్షన్ మాత్రమే: సీఎం రేవంత్

వివరాలు 2లో..

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి 119 నియోజక వర్గాల్లో క్షేత్ర స్థాయిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న పరిశీలన సమర్థంగా చేపట్టాలని సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి ఆదేశించారు. 238 ప్రాంతాల్లో




# 'హైడ్రా' పేరిట రేవంత్ ప్రభుత్వం వసూళ్లు..

### బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు!



- కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ వేలకోట్లు దండుకుందన్న మంత్రి
- ఇప్పుడు హైడ్రా పేరుతో కాంగ్రెస్ అదే పనిచేస్తోందని వ్యాఖ్య
- బీజేపీ ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందన్న బండి సంజయ్
- వారి కోసం ఒంటరిగానే పోరాటం చేస్తామని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలపై ప్రధానంగా చెరువుల ఆక్రమణలపై

వివరాలు 2లో..




# విమర్శలకు హద్దులుండాలి..

**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి కొండా సురేఖపై ట్రోల్స్ విషయంలో బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. అధికారం శాశ్వతం కాదని బీఆర్ఎస్ నేతలు గుర్తించాలని, బాధ్యతగల ప్రతిపక్షాలు మహి ళల పట్ల మరింత అప్రమత్తంగా వ్యవహరిం చాలని అన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ నాయకులపై విమర్శించదలుచుకుం టే ఓ హద్దు ఉండాలని అన్నారు. మహిళా మంత్రులను అవమాన పరిచేవిధంగా

వివరాలు 2లో..

# శని, ఆదివారాల్లో పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చింది




- హైడ్రా చీఫ్ రంగనాథ్ పై మండిపడ్డ హైకోర్టు.. అత్యుత్సాహం వద్దంటూ హెచ్చరిక
- ఉరితీసే ముందు కూడా చివరి కోరిక అడుగుతారని వ్యాఖ్య
- ఇళ్లను కూల్చేసేముందు బాధితులకు చివరి అవకాశం ఇచ్చారా? అని నిలదీసిన కోర్టు
- హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుందని వార్నింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయ నేతలను, పై అధికారులను సంతృప్తి పరిచేందుకు అత్యుత్సాహంతో పనిచేయొద్దని తెలంగాణ హైకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. హైడ్రా కూల్చివేతలకు సంబంధించి

వివరాలు 2లో..

# ముందు హైడ్రా ఆఫీసును కూల్చండి... ఎవరి కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ...

- బుల్డోజర్లకు అడ్డుగా నిలబడ్తం
- ఎవరి కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ
- రిజిస్ట్రేషన్ చేసినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు?
- ముందు హైడ్రా ఆఫీసును కూల్చండి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైడ్రా పేరుతో ప్రభుత్వం అమాయక ప్రజల ఇండ్లు కూలుస్తోందని మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్అయ్యారు. బాధితులకు తాము అండగా ఉండి బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతామన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగాన్ని మొత్తం పడగొట్టారని.. కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు భయపడుతున్నారని ఆరోపించారు. 100 రోజుల్లో చేస్తామన్న పనులను 300 రోజులు దాటినా రాష్ట్ర ప్రభుత్వం

వివరాలు 2లో..



# ఫొటోను అసభ్యకరరీతిలో పోస్ట్ చేశారు

### మంత్రి కొండా సురేఖ కంటతడి

- సోషల్ మీడియాలో రఘునందన్ రావు, మంత్రి కొండా సురేఖ ఫొటో
- అసభ్యకరరీతిలో పోస్ట్ పెట్టి అవమానించారన్న కొండా సురేఖ
- పోస్ట్ చూశాక అన్నం తినలేదని, నిద్రపోలేదని కంటతడి
- ఈ ఫొటోను మీ చెల్లి, అక్కకు చూపించాలని కేటీఆర్‌కు సూచన

వివరాలు 2లో..



# తెలంగాణ భవన్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ బాహాబాహీ

- కొండా సురేఖపై ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారని కాంగ్రెస్ ఆగ్రహం
- తెలంగాణ భవన్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు
- ఇరుపార్టీల నేతలు, కార్యకర్తల మధ్య వాగ్వాదం, పరస్పర దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్ వద్ద ఈరోజు మధ్యాహ్నం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంత్రి కొండా సురేఖపై కొంతమంది బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ భవన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సమయంలో ఇరుపార్టీల నేతలు, కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు

వివరాలు 2లో..





# అదే జరిగితే భారత్‌లో ప్రజాస్వామ్యం ఉండదు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైడ్రా చాలా హడావుడి చేస్తోందని.. మూసీ నిర్వాసితులను కొత్త ఇండ్లలోకి షిఫ్ట్‌చేసిన తర్వాత కూల్చివేతలు చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ సూచించారు. వన్ నేషన్ పేరుతో

వివరాలు 2లో..

# ఇకనైనా పద్ధతి మార్చుకోండి..

### బీఆర్ఎస్ నేతలకు మంత్రి సీతక్క మాస్ వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** సహచర మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో జరుగుతోన్న ట్రోలింగ్‌పై మంత్రి సీతక్క రియాక్ట్ అయ్యారు. కరీంనగర్‌లో (సెప్టెంబర్ 30) ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖపై ట్రోలింగ్ చేస్తోన్న బీఆర్ఎస్ పార్టీ ట్రోలర్స్‌పై నిప్పులు చెరిగారు. సహచర మంత్రి కొండా సురేఖ మెడలో

వివరాలు 2లో..

# ఢిల్లీకి సీఎం రేవంత్..ఎందుకంటే.?

**హైదరాబాద్ పెన్ పవర్:** (సెప్టెంబర్ 30) రాత్రి 8 గంటలకు ఢిల్లీ వెళ్లనున్నారు సీఎం రేవంత్ రెడ్డి . బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లనున్నారు. సెప్టెంబర్ 29న జమ్మూకశ్మీర్ కథువా సభలో అస్వస్థతకు గురైన AICC అధ్యక్షుడు ఖర్గేను పరామర్శించనున్నారు. ఆ తర్వాత అధిష్టానం పెద్దలతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశం ఉంది.

వివరాలు 2లో..



# చార్మినార్‌లోనూ నాకు వాటా ఉందంటారేమో... కాంగ్రెస్ ఎంపీకి లీగల్ నోటీసులు పంపిస్తున్నా

- తనపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- అనిల్ కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** తనకు ఎఫ్‌టీఎల్ పరిధిలోని కన్వెన్షన్‌లో వాటా ఉందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, అవసరమైతే గోల్కొండ కోట, చార్మినార్‌లోనూ తనకు వాటా ఉందని అంటారేమోనని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అబద్ధపు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేత, ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌కు లీగల్ నోటీసులు

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# డీలిమిటేషన్ తో ప్రాధాన్యం తగ్గుతుందా....

దక్షిణాది రాష్ట్రాలు రాబోయే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) వలన తక్కువ లోక్‌సభ స్థానాలు పొందనుండటం, జనాభా నియంత్రణ చేయని ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్ల పెంపులో లబ్ధి పొందనుండటం దురదృష్టకరం. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి కారణమైన దక్షిణాది రాష్ట్రాలు ఈ డీలిమిటేషన్ విధానం వలన భవిష్యత్తులో ప్రాధాన్యత కోల్పోతాయి. ఫలితంగా స్వంతంత్ర వేర్పాటువాద ధోరణులు హెచ్చరిల్లే అవకాశాలున్నాయి.ఏ రాష్ట్రానికి ఎన్ని ఎంపీ సీట్లు ఉండాలనేది ఆయా రాష్ట్రాల జనాభా ఆధారంగా నిర్ధారణ అవుతుంది. ప్రస్తుతం ఉన్న సీట్లు 1971 జనాభా లెక్కల ప్రకారం విభజించినవి. అయితే, 1971 తరువాత దక్షిణ భారత రాష్ట్రాలు జనాభాను బాగా తగ్గిస్తూ వచ్చాయి. అదే సమయంలో ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాలు జనా భాను పెంచుతూ పోయాయి. దీంతో జనాభా ను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్ల సంఖ్య తగ్గుతుంది. జనాభాను పెంచిన ఉత్తర రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్లు పెరుగుతాయి. అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నీ తీవ్రంగా నష్టపోతాయి. ఇప్పటికీ ఉత్తర భారత ఆధిపత్యంపై అనేక విమర్శలున్నాయి. ఆఖరికి ఎంపీ స్థానాల్లో కూడా దక్షిణాది బలం తగ్గిపోతే, ఇక దక్షిణ భారత్ నామమాత్రం అయిపోతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.నియోజకవర్గం సరిహద్దులు నిర్ణయించి, ఏ నియోజకవర్గంలో ఎంత మంది జనాభా ఉండా లి, ఏ ఏ గ్రామాలు, మండలాలు ఆ నియోజకవర్గంలో ఉండాలో నిర్ణయించే ప్రక్రియను పునర్విభజన లేదా డీలిమిటేషన్ అంటారు. రాజ్యాంగంలోని 82, 170 ప్రకరణల ప్రకారం జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన జరుగుతుంది. 1952, 1962, 1972, 2002లలో పునర్విభజనలు జరిగాయి. పునర్విభజన జరిగినప్పుడే సీట్ల సంఖ్య పెంచడం, తగ్గించడం కూడా చేస్తారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాలను విభజిస్తే దక్షిణ భారతానికి తీవ్ర నష్టం జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. భారతదేశ పౌరులందరి ఓటుకూ ఒకే విలువ ఉండాలని రాజ్యాంగం కోరుకుంటుంది. కానీ ప్రస్తుతం యూపీలో 30 లక్షల జనాభాకు ఒక ఎంపీ ఉంటే, తమిళనాడులో 18 లక్షల జనాభాకు ఒక ఎంపీ ఉన్నారు. అంటే ఇప్పుడు తమిళ ఓటర్ విలువ ఎక్కువ, యూపీ ఓటర్ విలువ తక్కువ అవుతుంది కదా. అలా జరగకుండా ఉండటం కోసం జనాభా ఆధారంగా ఎప్పటికప్పుడు నియోజకవర్గాలు పునర్విభజన చేస్తారు. ఒక నియోజవకర్గంలో లక్ష మంది కలసి ఒక ఎంపీని ఎన్నుకుని, మరో నియోజకవర్గంలో పాతిక లక్షల మంది ఒకే ఎంపీని ఎన్నుకోవడం కాకుండా, ప్రతీ ఓటుకీ సమాన విలువ ఉండాలన్న సిద్ధాంతం ప్రకారం ఈ ప్రక్రియ జరిగినప్పుడే అది ప్రజాస్వామ్య పునాదులకు బలాన్ని చేకూరుస్తుంది.1970ల మధ్య నుంచి 1980ల వరకూ భారతదేశం జనాభా నియంత్రణకు చాలా ప్రాధాన్యత ఇచ్చింది. ఆరుగురు, పదిమంది పిల్లలను కనవద్దు ...ఒకరిద్దరు పిల్లల్ని కంటే చాలు అంటూ ప్రభుత్వాలు విరివిగా ప్రచారం చేశాయి. ఆ దిశగా దక్షిణ భారత్‌లో మార్పు వచ్చింది. తక్కువ మంది పిల్లల్ని కన్నారు. ఫలితంగా జనాభా బాగా తగ్గింది. కానీ ఉత్తర భారతంలో చాలా రాష్ట్రాల్లో జనాభా నియంత్రణపై ప్రచారం సరిగా లేనందున జనాభా అలాగే ఉండిపోయింది. తీరా చూస్తే హిందీ రాష్ట్రాల్లో ఇప్పుడు విపరీతమైన జనాభా ఉంది. జనాభా ఎక్కువ ఉంటే ఎక్కువ సమస్యలు, తక్కువ ఉంటే ఎక్కువ లాభాలు అనే ధీమా ఉంది, కుటుంబ నియంత్రణ కారణంగా దక్షిణ భారతం హిందీ రాష్ట్రాల కంటే చాలా విషయాల్లో ముందుండడానికి దోహదపడింది. ఇప్పుడిదే శాపంగా మారబోతోందా? అనే భయం దక్షిణాది ప్రజల్లో బలంగా ఉంది.1976 వరకూ, డీలిమిటేషన్ జరిగితే రాష్ట్రాల వారీగా ఎంపీల సంఖ్య మారుతుండేది. అప్పటి వరకూ అన్నిచోట్లా జనాభా పెరుగుదల ఒకేలా ఉండేది కాబట్టి రాష్ట్రాల మధ్య ఒకట్రెండు సీట్లు పెరిగినా, తగ్గినా పెద్ద తేడాలు రాలేదు. సమస్య కాలేదు. కానీ, ఆ తరువాత జనాభా కట్టడి విషయంలో రాష్ట్రాల మధ్య మార్పులు వచ్చాయి అలాగే, 1976లో ఒక రాజ్యాంగ సవరణ ప్రకారం, నియోజకవర్గ సరిహద్దులు ఎలా అయినా మార్చవచ్చు కానీ, ఒక రాష్ట్రానికి ఉన్న ఎంపీల సంఖ్యను మార్చకూడదనేది ఆ సవరణ సారాంశం. అంటే జనాభా పెరుగుదల తగ్గుదలతో సంబంధం లేకుండా ఆయా రాష్ట్రాలకు ఎంపీల సంఖ్య నికరంగా ఉంటుంది. అప్పట్లో దానికి పాతికేళ్ల డెడ్ లైన్ పెట్టారు. అంటే 1976 నుంచి 2001 వరకూ మొదటి డెడ్‌లైన్ పూర్తయింది. 2001 నాటికి భారతదేశంలోని రాష్ట్రాల మధ్య జనాభా అంతరాలు తగ్గిపోతాయనుకున్నారు. కానీ అలా జరగలేదు. దీంతో 2001లో మరోసారి ఈ ఫ్రీజింగ్ గడువు మరో 25 ఏళ్లకు పెంచారు. అంటే 2026 అన్నమాట. ఇప్పటి డీలిమిటేషన్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఆ డెడ్ లైన్ ఇప్పుడు పూర్తయిపోతుంది. ఈ డీలిమిటేషన్లో ఆయా రాష్ట్రాలకు వచ్చే ఎంపీల సంఖ్య మార్చే అవకాశం చట్ట ప్రకారం కుదురుతుంది. చట్ట ప్రకారం 2026 తరువాత జనాభా లెక్కలు ఎప్పుడు జరిగితే అప్పుడు, వాటి ఆధారంగా నియోజవకర్గాల పునర్విభజన జరగాలన్నది మరో నిబంధన. ఇదే దక్షిణాది పార్టీల భయానికి కారణం.బీజేపీ తమ ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం, దక్షిణాదిన సీట్లు తగ్గించి, హిందీ ప్రాంతంలో సీట్లు పెంచాలని చూస్తోంది. అందుకోసం 2039 వరకూ ఆగకుండా అంతకుముందే డీలిమిటేషన్ చేయాలన్నది వారి ప్లాన్. అందుకోసం 2021 జనాభా లెక్కలను కోవిడ్ తగ్గి పోయినప్పటికీ, కావాలని ఆలస్యం చేసి 2026 తరువాత జరిగేలా చూసి, అప్పుడు వాటి ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయబోతోంది. ఇది కొందరు సోషల్ మీడియా వేదికగా చెప్పిన సొంత విశ్లేషణ. ఈ వార్తలే దక్షిణ భారత పార్టీలను కంగారు పెట్టాయి. అధిక జనాభాతో సతమతమవుతున్న దేశాన్ని కాపాడుకునేందుకు, జనాభా నియంత్రణ చేసిన దక్షిణాది రాష్ట్రాలు ఇప్పడు అన్యాయం అవుతున్నాయి. కేవలం 18 శాతం జనాభా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు 35% జాతీయ స్థూల జాతీయోత్పత్తికి నిధులు అందిస్తున్నాయి. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి కారణమైన దక్షిణాది రాష్ట్రాలు ఈ డిలిమిటేషన్ విధానం వలన భవిష్యత్తులో ప్రాధాన్యత కోల్పోతాయనే బాధ ఎక్కువగా ఉంది.రాష్ట్రాల జనాభా ఆధారంగా సీట్లు పెంచ కుండా, ప్రతీ రాష్ట్రానికీ నియమిత శాతం ప్రకా రం సీట్లు పెంచేలా చర్యలు ఉండాలని ఎక్కువ మంది చెబుతున్నారు. ఉదాహరణకు లోక్ సభలో 30 శాతం సీట్లు పెంచితే, అప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాలకు మరో 24 చేర తాయి. అలానే ఆంధ్రాలో 25కి 7 సీట్లు చేర తాయి. అలాంటి పద్ధతి వల్ల ఇబ్బంది ఉండదు. దశాబ్దాల కాలంలో జనాభా పెరుగుదల తేడాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. బీజేపీ హుందాగా వ్యవహరిస్తుందా? లేక వివక్ష చూపిస్తుందా? అని జనాభా లెక్కల తరువాతే తేలుతుంది. కొందరు విశ్లేషకులు అసలు లోక్‌సభ సీట్లు పెంచాల్సిన అవసరం లేదనే వాదిస్తున్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా ప్రజలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉండడ మే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి కాబట్టి సీట్ల సంఖ్య పెంచాలని ప్రతిపాదిస్తున్నా రు ఇంకొం దరు. ఏమైనా ఈ పంచాయతీ మళ్లీ జనాభా లెక్కలు పూర్తయిన తరువాతే తేలుతుంది.

## ఫొటోను అసభ్యకరరీతిలో పోస్ట్ చేశారు

**పెన్ పవర్ డెస్క్:**తమ పట్ల అసభ్యకరంగా పోస్టులు పెట్టారంటూ మంత్రి కొండా సురేఖ కంటతడి పెట్టారు. “ఓ మహిళనైన నా పట్ల చాలా అసహ్యంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. చాలా ఇబ్బందికరమైన ఫొటోలు పెట్టారు. వీళ్లకు షాదీ ముబారక్ ఎవరు ఇచ్చారు?” అంటూ పోస్ట్ పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు, మంత్రి కొండా సురేఖ ఫొటోలను పెట్టి కొంతమంది సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ పోస్ట్ అసభ్యకరరీతిలో పెట్టి, అవమానించారని సురేఖ ధ్వజమెత్తారు.ఈ పోస్టును చూశాక తాను నిన్నటి నుంచి అన్నం తినలేదని, నిద్రకూడా పోలేకపోయానన్నారు. ఈ పోస్టు పెట్టిన వారి ఇంట్లో కూడా అక్కా, చెల్లె, తల్లి ఉన్నారని, వారింట్లో ఆడపిల్లలు ఉన్నారని గుర్తించాలన్నారు.ఈ పోస్ట్ గురించి మీడియా సమావేశం నిర్వహించిన సురేఖ మాట్లాడుతూ... బీఆర్ఎస్ నాయకులారా, ఖబడ్దార్, అసహ్యంగా పోస్టులు పెడితే ఇక ఊరుకునేది లేదన్నారు. అధికారం పోయిందని బీఆర్ఎస్ వాళ్లు ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారని విమర్శించారు. ఈ పోస్ట్ చూసినప్పటి నుంచి తాను మానసిక ఆవేదనలో ఉన్నానన్నారు. ఓ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఓ చెల్లికి ఇచ్చినట్లు తన మెడలో చేనేత నూలు దండ వేశారని, దీనిని తప్పుగా చిత్రీకరించడం ఏమిటని నిలదీశారు. ఈ ఫొటోపై బీఆర్ఎస్ వాళ్లు ట్రోలింగ్ చేస్తున్నారన్నారు.నీ ఇంట్లో చెల్లిని ఇలాగే అంటే ఊరుకుంటారా? పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్ గారూ, ఈ ఫొటోను మీ చెల్లికి, తల్లికి చూపించు... వాళ్లు కరెక్ట్ అంటే అప్పుడు మాట్లాడు అన్నారు. ఈ ఫొటోకు సంబంధించి తాము సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇకపై సహించేది లేదన్నారు. ఇది అటవిక ప్రవర్తన అని విరుచుకుపడ్డారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలని లేదంటే బట్టలిప్పి ఉరికిస్తామని హెచ్చరించారు. పదేళ్లు దోచుకున్న బలుపు ఇంకా తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అక్టోబర్ 3 నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సర్వే..

- మొదటి పేజీ తరువాయి

క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని రేవంత్ సూచించారు. వార్డులు, డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన టీంల సంఖ్యను పెంచుకోవాలని సీఎం సూచించారు.

తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిట్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు/ డివిజన్ల ఎంపిక పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టును ఎన్ని రోజుల పాటు చేపడతారని సీఎం ప్రశ్నించారు. అక్టోబర్ మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అయిదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా ఒప్పుకుంటేనే ఫ్యామిలీ ఫొటో తీయాలని, అదో ఆప్షన్ గా ఉండాలని, కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని రేవంత్ తెలిపారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గ నిర్దేశం చేయాలని .. అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం దగ్గర ఉన్న రేషన్ కార్డు, పింఛను స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ, బీమా, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని.. పైలెట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతో పాటు కొత్త సభ్యులను జత చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం చేస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులుచేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు. పైలెట్ ప్రాజెక్టుతో బయటకు వచ్చిన సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక తయారు చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను పరిహారించిన అనంతర పూర్తి స్థాయి క్షేత్ర స్థాయి పరిశీలన చేపడదామని తెలిపారు.

# అదే జరిగితే భారత్‌లో ప్రజాస్వామ్యం ఉండదు

మొదటి పేజి తరువాయి

హక్కులను కాలరాస్తూ ఆర్డినెన్సులు తీసుకొచ్చే ఆలోచనలను కేంద్రం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. అదే జరిగితే ప్రజాస్వామ్యం ఉండదని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రంగా చేస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవుతామని వార్నింగ్ ఇచ్చారు.

హైదరాబాద్‌లోని సీపీఐ పార్టీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ‘చెరువులు, కుంటలు ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అక్రమ నిర్మాణాలు కూల్చితే పెద్దగా సమస్యే లేదు. మూసీ పరివాహక ప్రాంతంలోని నిర్వాసితులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి మూసీ ప్రక్షాళన చేయాల్సిందే. కొంతమంది అడ్డు పడుతారు.. సమస్య ఉంది కాబట్టి వ్యతిరేకిస్తరు. పేదలకు ప్రత్యామ్నాయాలు చూపకుండా కూల్చొద్దు. దేశంలో మౌలిక సదుపాయాల కోసం విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ హైవేలో సైడ్స్‌లో చాలా హైట్‌లో గోడలు కడుతున్నరు. రైతుల భూములు చుట్టూ ఉంటాయి..

వారు ఎక్కడ నుంచి నడవాలి? తాత్కాలిక ఉపశమనం కోసం అక్కడక్కడ గ్యాప్ ఇస్తున్నారు. కానీ దేశవ్యాప్తంగా ఎక్స్ ప్రెస్ వేలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలనేదే మా ప్రధాన డిమాండ్. సర్వీస్ రోడ్ ఉండాల్సిందే. అభివృద్ధి జరగాలి.. అంటే.. అదాని అభివృద్ధి కాదు. అందుకే కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి లేఖ రాశాం. రైతులకు అన్యాయం చేస్తే మా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతం’ అని నారాయణ హెచ్చరించారు.

# ‘హైడ్రా’ పేరిట రేవంత్ ప్రభుత్వం వసూళ్లు..

- మొదటి పేజి తరువాయి

హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. నిత్యం నగరంలో ఎక్కడో ఒకచోట కూల్చివేతలు చేపడుతూ వార్తల్లో నిలుస్తోందీ సంస్థ. అయితే, తాజాగా హైడ్రాపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు కూడబెట్టినట్లే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ కూడా హైడ్రా పేరిట వేల కోట్లు దండుకుంటోందని ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో పేదల తరఫున నిలబడి పోరాడతామని అన్నారు. బీజేపీ ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందన్న ఆయన.. వారి కోసం ఒంటరిగానే పోరాటం చేస్తామని తెలిపారు. ఇక కరీంనగర్‌లో విలీన గ్రామాలపై కూడా స్పందించిన మంత్రి గ్రామాలను విలీనం చేసే ముందు ప్రభుత్వం స్థానికుల అభిప్రాయం తీసుకోవాలని చెప్పారు.

అలాగే తమిళనాడులో సీఎం ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడాన్ని విమర్శించారు. తాము ఇలాంటి వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ తరహా వారసత్వ రాజకీయాలు ప్రజా ప్రభుత్వాలకు మంచిది కాదని హితవు పలికారు.

# చార్మినార్‌లోనూ నాకు వాటా ఉందంటారేమో... కాంగ్రెస్ ఎంపీకి లీగల్ నోటీసులు పంపిస్తున్నా

- మొదటి పేజి తరువాయి

పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. తనకు బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా వేస్తానని వెల్లడించారు. పరువు నష్టం దావాకు అనిల్ కుమార్ సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.ప్రజాసమస్యలపై పోరాడుతున్న తనపై బురదజల్లే వికృత రాజకీయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు. ప్రభుత్వంపై వస్తోన్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి గోబెల్స్ ప్రచారాలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. హిమాయత్ సాగర్‌లో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆనంద కన్వెన్షన్‌లో హరీశ్ రావుకు వాటాలు ఉన్నాయంటూ ఎంపీ అనిల్ కుమార్

యాదవ్ ఆరోపణలు చేశారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి ఇటీవల మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ క్రమంలో వారు రాజకీయ డ్రామాలు చేస్తున్నారని, ఆనంద కన్వెన్షన్‌లో హరీశ్ రావుకు వాటాలు ఉన్నాయని అనిల్ కుమార్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు స్పందించారు.

# శని, ఆదివారాల్లో పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చింది

- మొదటి పేజి తరువాయి

ఆ సంస్థ చీఫ్ రంగనాథ్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సెలవు దినాల్లో పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, శని ఆది వారాల్లో కూల్చివేతలు చేపట్టడమేంటని నిలదీసింది. కరుడుగట్టిన నేరస్థుడిని ఉరితీసే ముందు కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారని గుర్తుచేస్తూ.. ఇంటిని కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా? అంటూ ప్రశ్నించింది. ఈమేరకు హైడ్రా కూల్చివేతలపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సోమవారం ఉదయం విచారణ చేపట్టింది. హైడ్రా చీఫ్ వర్చువల్ గా, అమీన్ పూర్ తహసీల్దార్ కోర్టులో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైడ్రా చీఫ్ రంగనాథ్ కు హైకోర్టు పలు ప్రశ్నలు సంధించింది.

### శని, ఆదివారాల్లోనే ఎందుకు?

ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ ఆదివారం సెలవుదినం.. అలాంటిది సెలవు దినాలలో మీరు ఎందుకు పనిచేస్తున్నారని రంగనాథ్ ను హైకోర్టు ప్రశ్నించింది. శని, ఆదివారాల్లో అదికూడా సూర్యాస్తమయం తర్వాత కూల్చివేతలు ఎందుకు చేపడుతున్నారని నిలదీసింది. గతంలో వారాంతంలో కూల్చివేతలు చేపట్టవద్దంటూ కోర్టులు తీర్పిచ్చిన విషయం తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టప్రకారం నడుచుకోకపోతే తర్వాత ఇబ్బంది పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు చెప్పారనో, పై అధికారులు ఆదేశించారనో అత్యుత్సాహంతో పనిచేస్తే ఆ తర్వాత ఇబ్బంది పడతారంటూ అధికారులకు వార్నింగ్ ఇచ్చింది.

### అడిగిన ప్రశ్నకు మాత్రమే జవాబివ్వండి..

ఆదివారం కూల్చివేతలు చేపట్ట వచ్చా అని హైకోర్టు ప్రశ్నించగా.. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బంది కావాలని కోరడంతో సమకూర్చామని రంగనాథ్ జవాబు చెప్పారు. దీనిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అడిగిన ప్రశ్నకు నేరుగా జవాబివ్వాలని హెచ్చరించింది. చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని అడిగింది. ఆక్రమణదారులు ఇల్లు ఖాళీ చేయనంతమాత్రాన కూల్చివేతలు చేపట్టడమేంటని ప్రశ్నించింది. ఆదివారం కూల్చివేతలు చేపట్టడం హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అంటూ మండిపడింది. చట్ట ప్రకారం నడుచుకోకుంటే ఇంటికి వెళతారు జాగ్రత్త.. అంటూ అధికారులను హెచ్చరించింది.

### కూల్చివేతలపై మాత్రమే దృష్టి పెట్టారేం?

హైడ్రాకు ఉన్న విధుల్లో ఆక్రమణల తొలగింపు కూడా ఒకటని, కేవలం ఇదొక్కటే హైడ్రా డ్యూటీ కాదని హైకోర్టు పేర్కొంది. జీవో ప్రకారం నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే బాధ్యత కూడా హైడ్రాకు ఉందని, మరి దానిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదేమని ప్రశ్నించింది. అమీన్ పూర్ కూల్చివేతలతో పాటు మూసీ విషయంలోనూ 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని హైకోర్టు పేర్కొంది. దీంతో ఇది అరుదైన కేసుగా భావించి అధికారులను విచారణకు పిలిచినట్లు తెలిపింది. నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చింది.

చట్టప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తిచేసి, స్థానిక సంస్థల అనుమతి తీసుకున్నాకే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని కోర్టు గుర్తుచేసింది. అయితే, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించింది. హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. కానీ దాని పనితీరుపైనే తమ అభ్యంతరమని కోర్టు పేర్కొంది. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదని, ఎఫ్ టీఎల్ నిర్ధారించకుండా అక్రమాలను ఎలా తేలుస్తారని నిలదీసింది. అనంతరం కేసు విచారణను ఈ అక్టోబర్ 15 కు వాయిదా వేస్తూ అప్పటి వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది.

# విమర్శలకు హద్దులుండాలి..

- మొదటి పేజి తరువాయి

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు.

ఇది మంచి పద్ధతి కాదని, రాజకీయంగా మహిళలకు 50 శాతం కోటా ఇచ్చేవిధంగా సోనియా కృషి చేసారని అన్నారు. చట్టసభల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు కావాలని పోరాటం చేసిన పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు.గతంలో తనమీద, సీతక్క మీద కూడా అవమానకరంగా మాట్లాడారని అన్నారు.అధికారంలో ఉన్నప్పుడు మహిళలకు మంత్రి పదవులీయని వారి గురించి, చేయలేని వ్యాపారం చేసి జైలుకు వెళ్లిన మహిళల గురించి తాము మాట్లాడటం లేదని చురకలంటించారు.

# ఇకనైనా పద్ధతి మార్చుకోండి..

- మొదటి పేజి తరువాయి

ఎంపీ రఘునందన్ రావు నూలు దండ వేస్తే దాన్ని వక్రీకరించి సోషల్ మీడియాలో దారుణంగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కు మహిళలు అంటే చులకనని అందుకే ట్రోల్ చేస్తారని ధ్వజమెత్తారు. మహిళా మంత్రులను, మహిళా నేతలు వెంటపడి మరీ బీఆర్ఎస్ సోషల్ మీడియా వేధిస్తుందని.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు రికార్డ్ డాన్సులు చేసుకోండి అన్న దుర్మార్గుల పార్టీ బీఆర్ఎస్ అని సీతక్క విరుచుకుపడ్డారు.మహిళా మంత్రిగా నేను, సోదర మంత్రి పొన్నం పవిత్రమైన అసెంబ్లీలో మాట్లాడిన ఫోటోలను కూడా మార్ఫింగ్ చేసి దుర్మారంగా వ్యవహరించారని ఫైర్ అయ్యారు. సీఎం కుటుంబాన్ని, వారి పిల్లల్ని వేధిస్తున్న మీరు మనుషులేనా అని విమర్శించిన సీతక్క.. మీ ఇంట్లో మహిళలు ఏ వ్యాపారాలు చేశారో దేశానికి తెలుసని.. అయినా ఆడకూతురు అన్న కారణంతో మేము ఏనాడు చెడుగా స్పందించ లేదన్నారు. దొర ఆహకారంతోనే బీఆర్ఎస్ మహిళా నేతలను టార్గెట్ చేస్తుందోని.. రాజకీయాల్లో, ప్రజా జీవితంలో క్రియా శీలకంగా పనిచేసే వారిపై బురద చల్లుతున్నారని మండిపడ్డారు.

ఎన్నో కష్ట నష్టాలు అధిగమించి రాజకీయాల్లో ఎదిగొచ్చిన మహిళా నేతలపై తప్పుడు ప్రచారాలా..? ఈ రకంగా దుష్ప్రచారం చేస్తే మహిళలు రాజకీయాల్లోకి రాగలుగుతారా అని ప్రశ్నించారు. ఆడ కూతుర్లను అత్యంత అవమానకరంగా ట్రోల్ చేసి వారిని వేయ్యేండ్లు మళ్లీ వెనక్కు నెడుతున్నారని.. మళ్లీ దొరల రాజ్యం తెవాలన్న తలంపుతోనే సోషల్ మీడియా ద్వారా మహిళా నేతలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మీ ఫ్యూడల్ మెంటాలిటికి, పితృ స్వామ్య భావజాలానికి నిదర్శనమని విమర్శించారు.మొన్న మేయర్ విజయ లక్ష్మీ, నిన్న నాపై, నేడు కొండా సురేఖపై తప్పుడు ప్రచారం చేస్తూ మహిళా నాయకత్వాన్ని బీఆర్ఎస్ వెనక్కి నెడుతోందని.. అసలు మహిళలు రాజకీయాల్లో రావాలా వద్ద అనేది బీఆర్ఎస్ స్పష్టం చేయాలని ఈ సందర్భంగా సీతక్క డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ బీకారు నాయకులారా ఇకనైనా పద్దతి మార్చుకోండని సీతక్క మాస్ వార్నింగ్ ఇచ్చారు. దుర్మార్గపు ఆలోచనలు మానుకుని బుద్ధి తెచ్చుకోండని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. మంత్రి కొండా సురేఖకు బీఆర్ఎస్ తక్షణమే క్షమాపణలు చెప్పి.. తమ సోషల్ మీడియాను కట్టడి చేయాలని సీతక్క డిమాండ్ చేశారు.

# ముందు హైడ్రా ఆఫీసును కూల్చండి... ఎవరి కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ...

- మొదటి పేజి తరువాయి

అమలు చేయడం లేదని ఆరోపించారు.

ఇప్పటివరకు ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదన్నారు. తెలంగాణ భవన్ లో కేటీఆర్‌మీడియాతో మాట్లాడుతూ ‘సీఎం రేవంత్ రెడ్డి మూసీ బాధితుల పాలిట కాలయముడిలా తయారయ్యిండు. ఎవరి కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ అంటున్నరు. రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. ఎన్ని ఎకరాలకు నీరు వస్తుంది? కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఇండ్లకు పట్టాలు వచ్చాయని ప్రజలు అంటున్నరు. రిజిస్ట్రేషన్ చేసినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు చెప్తున్నారని పేదలు అడుగుతున్నారు.

ఇల్లు అనేది ప్రతిఒక్కరికి ఉద్వేగంతో కూడిన అనుబంధం. అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ఇళ్లను ఎలా కూల్చేస్తారు? పేదల ఇండ్లు కూలుస్తుంటే మేం చూస్తూ ఊరుకోం. కూల్చాల్సి వస్తే మొదట హైడ్రా కమిషన్ కార్యాలయం, బుద్ధభవన్ ను కూల్చాలి. అసలు ఈ ప్రభుత్వానికి ఏమైనా ప్రాధాన్యతలు ఉన్నాయా? రిజిస్ట్రేషన్ ఆదాయం రూ.1,150 కోట్ల నుంచి రూ.750 కోట్లకు పడిపోయింది’ అని అన్నారు.

## తెలంగాణ భవన్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ బాహాబాహీ

- మొదటి పేజి తరువాయి

చేసుకుంది. ఇది పరస్పరం దాడికి దారి తీసింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఇరుపార్టీల వారిని చెదరగొట్టారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

## ఢిల్లీకి సీఎం రేవంత్.. ఎందుకంటే.?

- మొదటి పేజి తరువాయి

తాజా రాజకీయాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఆయన వివరిం చను న్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవులపై కూడా చర్చించే అవకాశం ఉంది.


### మోదీని గద్దె దించే వరకు చావను

కథువా బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే మాట్లాడుతుండగా.. ఉన్నట్టుండి అదుపు తప్పి కింద పడబోయారు. పక్కనే ఉన్న నేతలు ఖర్గేను కిందపడకుండా పట్టుకున్నారు. కాస్తన్ని నీళ్లు తాగిన ఖర్గే.. మళ్లీ ప్రసంగం కొనసాగించారు. ఆయన అస్వస్థతకు గురికాక ముందే తనకు ఎనబై మూడేళ్లు అయినప్పటికీ.. ఫిట్ గా ఉన్నాని అన్నారు. మోదీ సర్కార్ ను గద్దె దించే వరకు బతికే ఉంటానన్నారు ఖర్గే. జమ్ము కాశ్మీర్ కు మళ్లీ రాష్ట్ర హోదా వచ్చే వరకు కాంగ్రెస్ పోరాడుతుందని ఆయన అన్నారు.

# సంక్రాంతి తర్వాతే టీటీడీ బోర్డు,,,?

**తిరుమల, సెప్టెంబర్ 30, పెన్ పవర్:** రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో క్రేజ్ ఉండే నామినేడెట్ బోర్డు అది? జీవితంలో ఒకసారైనా ఆ బోర్డులో ఏదో ఒక పోస్టులో పనిచేయాలని చాలా మంది కలలు కంటుంటారు. సీఎం నుంచి పీఎం వరకు రికమెండేషన్స్ చేయించుకుంటుంటారు. అలాంటి పోస్టును వీలైనంత త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వం కూడా భావించింది.ఒకరిద్దరి పేర్లు ప్రచారంలోకి వచ్చినా లిస్టు మాత్రం ఫైనల్ అయిందనే అనుకున్నారు. కానీ, తొలివిడత నామినేడెట్ పోస్టుల జాబితాలో ఆ బోర్డు ఊసే లేకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పట్లో నియామకం జరిగే ఛాయలు కూడా కనిపించడం లేదు. ఇక క్యాలెండర్ మారితేగాని ఆ పోస్టు భర్తీ ఉండదనే తాజా సమాచారం ఆశావహుల ఆశలకు గండికొడుతోందంటున్నారు? ఇంతకీ ఆ క్రేజీ పోస్టు ఏంటి? నియామకంలో చోటుచేసుకుంటున్న ట్విస్టులేంటి?ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నామినేటెడ్ పోస్టుల్లోకల్లా అత్యంత ప్రధానమైనది తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు. చైర్మన్‌తోపాటు దాదాపు డజను మంది సభ్యులుగా ఉండే ఈ బోర్డుకు దేశవ్యాప్తంగా క్రేజ్ ఉందంటే అతిశయోక్తి కాదు. తెలుగు రాష్ట్రాల వారే కాదు టీటీడీ బోర్డులో డైరెక్టర్‌గా పనిచేసేందుకు తమిళ, కన్నడ నేతలతోపాటు ఉత్తరాది రాష్ట్రాల వారూ ఆసక్తి చూపుతుంటారు. ఇక ఏపీకి చెందిన ప్రముఖులు టీటీడీ చైర్మన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుంటారు.వీఐపీలతో సంబంధాలతోపాటు నిత్యం శ్రీవారి సేవలలో తరించే భాగ్యం కోసం టీటీడీ చైర్మన్, డైరెక్టర్‌గా పనిచేసేందుకు నేతలు పోటీ పడుతుంటారు. ఇంతటి పోటీ ఉన్న బోర్డు ప్రస్తుతం ఖాళీగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నుంచి టీటీడీ బోర్డు నియామకంపై అనేక ఊహాగానాలు వినిపించాయి. కానీ, ఇంతవరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మదిలో ఏముందో ఎవరికీ అంతుచిక్కడం లేదు.కూటమి ప్రభుత్వం కొలువు దీరి వంద రోజులు దాటిపోయింది. మరో వారం గడిస్తే నాలుగో నెల కూడా పూర్తవుతుంది. అయినా టీటీడీ బోర్డు నియామకం జరగలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పట్లో బోర్డు నియామకం ఉండదనే టాక్ వినిపిస్తోంది. శ్రీవారి ప్రసాదం లడ్డూ వ్యవహారంలో ఏదో ఒకటి తేలితేగానీ టీటీడీ పదవులను భర్తీ చేయరని ప్రచారం జరుగుతోంది. జూన్‌లో ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్న వెంటనే తొలుత టీటీడీ బోర్డునే భర్తీ చేస్తారని చెప్పుకున్నారు.అయితే అప్పట్లో దుర్ముహూర్తాలు ఉన్నాయని ఆగస్టుకు వాయిదా వేశారు. ఆగస్టులో రకరకాల విశ్లేషణలు, సర్వేలతో కాలం హరించుకుపోయింది. ఇక ఈ నెల ఆరంభంలో విజయవాడ వరదలతో నామినేటెడ్ పోస్టుల ఊసే ఎత్తలేదు. ఇక కొద్ది రోజుల క్రితం 20 నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసినా, అందులో టీటీడీ లేదు. దీనికి ప్రధాన కారణం లడ్డూ వివాదమేనని చెబుతున్నారు. లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు రావడంతోనే టీటీడీ బోర్డును భర్తీ చేయలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.గత బోర్డు తీసుకున్న నిర్ణయం వల్లే నెయ్యిలో నాణ్యత లేదని నిరూపించేందుకు కొత్త బోర్డును వేయలేందంటున్నారు. ఒకవేళ కూటమి ప్రభుత్వం వచ్చాక టీటీడీ బోర్డు నియమించివుంటే లడ్డూ పాపం.. కొత్త బోర్డుపై పడేదని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తాజాగా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో ఇప్పట్లో టీటీడీ బోర్డు కొలువుదీరే పరిస్థితి కనిపించడం లేదుటీటీడీ చైర్మన్ పదవి కోసం టీడీపీలో చాలా మంది పోటీ పడుతున్నారు. ముఖ్యంగా ఓ మీడియా సంస్థ అధినేతకు చైర్మన్ పదవి ఖరారు చేశారని ప్రచారం జరిగింది. బోర్డు సభ్యులు మాత్రమే ఎంపిక చేయాల్సివుందని చెప్పారు. అయితే పార్టీ నేతలకు కాకుండా మీడియా సంస్థ అధినేతకు ఎలా ఇస్తారంటూ కొద్ది మంది సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. దీంతో పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి టీడీ జనార్దన్‌రావు పేరు తెరపైకి వచ్చింది.ఇదే సమయంలో ఓ రిటైర్డ్ న్యాయమూర్తి, ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, సీనియర్ ఎమ్మెల్యే కళావెంకటరావు వంటివారి పేర్లు పరిశీలించారని అంటున్నారు. ఐతే ప్రజలతో నేరుగా సంబంధాలు ఉన్నవారికే చైర్మన్ పదవి ఇవ్వాలని పార్టీ సీనియర్ల సూచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. మీడియా సంస్థ అధినేతకు ఖాయం అనుకున్నా, పార్టీ సీనియర్ల సూచనలతో నియామక ప్రకటన ఆలస్యమైందని.. ఈ లోగా లడ్డూ వివాదంతో ఇప్పట్లో ఈ పోస్టు భర్తీ అయ్యే పరిస్థితి కనిపించడం లేదంటున్నారు.ప్రస్తుతం లడ్డూ వ్యవహారంపై సిట్ దర్యాప్తు జరుపుతుంది. ఈ అంశంలో తప్పు ఎక్కడ జరిగింది? బాధ్యులు ఎవరు అన్నది స్పష్టమైన తర్వాతే.. టీటీడీపై కొత్త నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందంటున్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో ఉన్నట్లు జంబో పాలకవర్గం ఉండదని, బీజేపీ పెద్దలు కూడా టీటీడీని రాజకీయ పునరావస కేంద్రంగా చేయొద్దని కోరడంతో పాలకవర్గ ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు లడ్డూ వ్యవహారం వెలుగుచూసిన తర్వాత టీటీడీని ధార్మిక సంఘాలకు అప్పగించాలని సాధు సంతులు కోరుతున్నారు. రాజకీయాలతో సంబంధం లేనివారికి టీటీడీలో పదవులు కట్టబెట్టాలని హిందూ సంఘాలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పాలకవర్గ నియామకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితులు చూస్తుంటే.. టీటీడీ బోర్డు నియామకం సంక్రాంతి తర్వాతేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# మరో 3 వేల కోట్లు అప్పునకు సర్కార్ ప్లాన్



**విజయవాడ, సెప్టెంబర్ 30, పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. అధికారంలోకి వచ్చిన మూడున్నర నెలల్లోనే ఏకంగా ఏడుసార్లు రూ.20,000 కోట్ల అప్పుకు ఏపీ ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. అందులో భాగంగానే తాజాగా అక్టోబర్ 1న నిర్వహించే వేలంలో రూ.3,000 కోట్ల అప్పునకు ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది.కూటమి ప్రభుత్వం ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టింది. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి పార్టీలు, వాటిని నెరవేర్చాల్సిన అవసరం ఉంది. అందుకోసం భారీస్థాయిలో నిధులు అవసరం కానుంది. దీంతో ప్రభుత్వం ఆ దిశగా అప్పు కోసం ఆస్తులను ఇండెంట్ పెడుతుంది. అందులో భాగంగా ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ బాండ్లను కూటమి ప్రభుత్వం వేలానికి పెట్టింది. ఇప్పటివరకు ఆరుసార్లు 17,000 కోట్ల అప్పుకు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. తాజాగా అక్టోబర్ 1న నిర్వహించే సెక్యూరిటీస్ వేలంలో మరో రూ. 3,000 కోట్ల అప్పుకు ఇండెంట్ ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఈ-కుబేర్) వేలం వేయనుంది. కాంపిటీటివ్, నాన్ కాంపిటీటివ్ బిడ్స్ రూపంలో ఆర్బీఐ వాటిని విక్రయిస్తుంది.

**జూన్ 11న రూ.2,000 కోట్లు**

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జూన్ 11న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 2,000 కోట్ల (రూ.500 కోట్లు, రూ.500 కోట్లు, రూ.1,000 కోట్లు) అప్పుకు రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.500 కోట్ల విలువ చేసే రెండు సెక్యూరిటీ బాండ్ల, రూ.1,000 కోట్ల విలువ చేసే ఒక సెక్యూరిటీ బాండ్ ఏపీ ప్రభుత్వం వేలానికి పెట్టింది. ఈ బాండ్ల కాల పరిమితి నిర్ణయించింది. మొదటి రూ.500 కోట్ల బాండు 15 ఏళ్లు, రెండో రూ.500 కోట్ల బాండు 19 ఏళ్లు, రూ.1,000 కోట్ల బాండ్ 21 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**జూన్ 25న రూ. 2,000 కోట్లు**

జూన్ 25న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 2,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున రెండు బాండ్లు) అప్పునకు రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే రెండు సెక్యూరిటీ బాండ్లను ఏపీ ప్రభుత్వం వేలానికి పెట్టింది. ఈ బాండ్ల కాల పరిమితి నిర్ణయించింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 11 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 20 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**జులై 2న రూ.5,000 కోట్లు**

జులై 2న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 5,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున ఐదు బాండ్లు) అప్పుకు రాష్ట్రంలోని టీడీజీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే ఐదు సెక్యూరిటీ బాండ్లను ఏపీ ప్రభుత్వం వేలానికి పెట్టింది. ఈ బాండ్ల కాల పరిమితి నిర్ణయించింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 9 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 12 ఏళ్లు, మూడు రూ.1,000 కోట్ల బాండు17 ఏళ్లు, నాలుగో రూ.1,000 కోట్ల బాండు 21 ఏళ్లు, ఐదో రూ.1,000 కోట్ల బాండు 24 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**జులై 16న రూ. 2,000 కోట్లు**

జులై 16న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 2,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున రెండు బాండ్లు) అప్పుకు రాష్ట్రంలోని టీడీజీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే రెండు సెక్యూరిటీ బాండ్లను ఏపీ ప్రభుత్వం వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 16 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 19 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**జులై 30న రూ. 3,000 కోట్లు**

జులై 30న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 3,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున మూడు బాండ్లు) అప్పుకు రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను ఏపీ ప్రభుత్వం వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 15 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 20 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 25 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**ఆగస్టు 27న రూ. 3,000 కోట్లు**

ఆగస్టు 27న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 3,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున మూడు బాండ్లు) అప్పుకు రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను ఏపీ ప్రభుత్వం వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 12 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 17 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 22 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**అక్టోబర్ 1న రూ. 3,000 కోట్లు**

తాజాగా అక్టోబర్ 1న నిర్వహించనున్న స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 3,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున మూడు బాండ్లు) అప్పుకు రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను ఏపీ ప్రభుత్వం వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 14 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 20 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 24 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

ఈ సెక్యూరిటీ బాండ్లను వ్యక్తులు, సంస్థలు కొనుగోలు చేయొచ్చని ఆర్బీఐ తెలిపింది. కాంపిటీటివ్ విధానంలో బాండ్లను కొనుగోలు వారు ఈనెల 27 (మంగళవారం)న ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల మధ్య కాంపిటేటివ్ (పోటీ) బిడ్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని, అలాగే ఉదయం 10.30 గంటల నుంచి ఉదయం 11 గంటల మధ్య నాన్ కాంపిటేటివ్ (పోటీ లేని) బిడ్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని ఆర్బీఐ తెలిపింది.

# నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం




మనిషి రక్తం అమూల్యమైనది. ఎందుకంటే రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క దేశంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే. ఈ రక్తంలో గ్రూపులు ఉన్నాయి గానీ.. రక్తానికి ప్రాంతాలు లేవు, కులమత భేదాలు లేవు. సమైక్య భావనను ఈ రక్తం పూర్తిస్థాయిలో చూపిస్తుంది. ఎవరెక్కడివారైనా.. గ్రూపు సరిపోతే చాలు, భేషుగ్గా ఆ రక్తం ఎక్కించుకోవచ్చు.

మన దేశంలో నాలుగు కోట్ల యూనిట్ల రక్తం అవసరం కాగా.. కేవలం 40 లక్షల యూనిట్లే అందుబాటులో ఉంది. మిగతా దేశాలతో చూస్తే మన దేశంలో స్వచ్ఛందంగా రక్తం దానం చేసేవారి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడున్న పరిస్థితిలో దేశంలో డిమాండుకు తగినంత రక్తం అందుబాటులో లేదు. ఇక మన రాష్ట్రం విషయానికొస్తే... రాష్ట్ర జనాభాలో ఒక్క శాతం మంది సంవత్సరానికి ఒకసారి రక్తం దానం చేసినా రక్తం కొరత తీరుతందంటున్నారు వైద్యులు.

మన దేశంలో జాతీయ స్వచ్ఛంద రక్త దాన దినోత్సవం 1975 నుంచి ప్రారంభమైంది. అయితే రక్తదానంపై ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తే... ఆశించిన స్థాయిలో దాతలు ముందుకొస్తారని వైద్యులు అంటున్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం ను ప్రతి సంవత్సరం అక్టోబరు 1 న జరుపుకుంటారు. 1975లో స్వరూప కృష్ణన్, డాక్టర్ జె.జి జోలీల చొరవతో ఈ పద్ధతి ప్రారంభమయింది. ఈ రోజున ప్రత్యేకంగా రక్తదానంపై కొన్ని కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు రక్తదానం యొక్క ఆవశ్యకత గురించి తెలియచేస్తూ వారు రక్తదానం చేసేలా వారిలో చైతన్యాన్ని కలిగిస్తారు.

# నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం




ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబరు 1న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. మూగజీవాలపై మానవ ప్రేమను ప్రోత్సహించి, పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడేదిశగా ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ దినోత్సవం నిర్వహించబడుతోంది. ప్రపంచవ్యాప్తంగా శాకాహారులను ఒక వేదికపైకి తీసుకువచ్చేందుకు 1970లలో ఉత్తర అమెరికా శాకాహార సొసైటీ ఏర్పడింది. 1977లో తొలిసారిగా అమెరికాలో ఈ దినోత్సవాన్ని ప్రారంభించగా,1978లో అంతర్జాతీయ శాకాహారం యూనియన్ ఆమోదించింది. ప్రపంచ శాకాహారం దినోత్సవం సందర్భంగా అక్టోబరు నెల శాకాహార అవగాహన నెలగా ప్రారంభిమై, నవంబరు 1న ప్రపంచ వేగన్ దినోత్సవంతో ముగుస్తుంది. శాకాహార పద్ధతులు, ప్రయోజనాలను ప్రోత్సహించడానికి స్థానిక, ప్రాంతీయ, జాతీయ సమూహాలు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తాయి.శాకాహారం ప్రాముఖ్యతను తెలిపేందుకు, అవగాహన కలిగించేందుకు వివిధ దినోత్సవాలు కూడా ఉన్నాయి.

## 12న బన్నీ ఉత్సవం

**కర్నూలు, సెప్టెంబర్ 30, పెన్ పవర్:** దసరా.. పండగను దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సహంగా జరుపుకుంటారు. కానీ, ఆంధ్రప్రదేశ్‌లోని దేవరగట్టులో మాత్రం దసరా ఉత్సవాలను విభిన్నంగా జరుపుకుంటారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఇక్కడ కర్రల సమరం సాగిస్తారు. పండగ పూట ప్రజలు నెత్తురు చిందిస్తారు. విజయదశమి పండుగ నాడు అర్ధరాత్రి దేవరగట్టులో కర్రల సమరం ఉత్సవంగా జరుగుతుంది. మాత మాళమ్మకు, మల్లేశ్వరునికి కల్యాణం నిర్వహించిన అనంతరం.. కర్రల సమరం జరపడం ఇక్కడ ఆనవాయితీ. ఈ వేడుకలకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. ప్రతీ ఏటా నిర్వహించే ఈ వేడుకకు చాలా ప్రాధాన్యత ఉంది. ఈ యేడు కూడా హోలగుంద మండలం దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి దసరా బన్ని ఉత్సవాలకు ముహూర్తం ఖరారు చేశారు వేదపండితులు.

- అక్టోబర్ 7వ తేది ఉదయం నెరినికి గ్రామంలో స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు
- దేవరగట్టులో పూజల అనంతరం కంకనాథరణం జరుగుతుంది.
- దసరా పండుగ రోజు 12వ తేది రాత్రి బన్ని ఉత్సవం కర్రల సమరం జరగనుంది.
- 13వతేది ఉదయం ఆలయ పూజారి దైవవాణి కార్యక్రమం నిర్వహిస్తారు.
- 14 వతేది సాయంత్రం స్వామి వార్ల రథోత్సవం ఉంటుంది.
- 15 వతేది ఉదయం స్వామి వారి కళ్యాణ కట్ట ముందు గొరవయ్యాల నృత్యాలు
- 16 వ తేది కొండ నుంచి ఉత్సవల విగ్రహాలు నెరినికి, తండా, కొత్తపేట గ్రామాల భక్తుల నడుమ ఊరేగిపుగా చేరే కార్యక్రమం
- దసరా సందర్బంగా దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు ఆలయ కమిటీ నిర్వాహకులు.

## కొలికపూడి మాకు వద్దంటూ... టీడీపీకి పంచాయితీ

**విజయవాడ, సెప్టెంబర్ 30, పెన్ పవర్:** తిరువూరు టీడీపీ పంచాయితీ మంగళగిరికి చేరింది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై టీడీపీ నేతలు, కార్యకర్తలు పార్టీ అగ్రనేతలకు ఫిర్యాదు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడిని టీడీపీ శ్రేణులు నిలదీశారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీరుపై సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. 2 రోజుల కిందట చిట్టెల గ్రామ టీడీపీ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే కొలికపూడి దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన సర్పంచ్ భార్య కవిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విజయవాడ ఆయుష్ ఆసుపత్రిలో కవిత చికిత్స పొందుతున్నారు.కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన మీడియా ప్రతినిధులు కూడా శనివారం చంద్రబాబును కలిశారు. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. కొలికపూడి ఎప్పటికప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, విసుగు పుట్టించే కార్యక్రమాలతో ఇప్పటికే పార్టీ నాయకత్వానికి తలనొప్పి ఎదురవుతోందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.ఎమ్మెల్యే ద్వారా అవమానం, బెదిరింపులు జరుగుతున్నాయని కొన్ని ఆధారాలను చంద్రబాబుకు చూపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ నేపథ్యంలో తనకు అన్నీ తెలుసని.. సమస్యను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి హామీ ఇచ్చినట్టు తెలిసింది.కొలికపూడి శ్రీనివాసరావు అమరావతి రైతు ఉద్యమం ద్వారా వెలుగులోకి వచ్చారు. నాలుగేళ్ల పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబుతో సన్నిహితంగా మెలిగారు. దీంతో టీడీపీ పొత్తుల తొలి జాబితాలో ఆయనకు తిరువూరు నుంచి టికెట్ లభించింది. టీడీపీ నేతృత్వంలోని కూటమికి మద్దతు పలకడంతో.. తిరువూరు నుంచి సులువుగా గెలిచి తొలిసారి రాష్ట్ర అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కొలికపూడి దూకుడు పార్టీని ఇబ్బందులకు గురిచేస్తోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే, సత్వర న్యాయం పేరుతో వైసీపీ నాయకుడి ఇంటిని కూల్చివేయాలని ఆయన ప్రయత్నించడం కలకలం సృష్టించింది. ఈ ఇష్యూలో చంద్రబాబు జోక్యం చేసుకోవలసి వచ్చింది. కొలికపూడి దూకుడు స్వభావంపై చంద్రబాబు మందలించారు.ఇటు స్థానిక టీడీపీ నేతలు కూడా కొలికపూడిపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. చిట్టెల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు .. తనను ఎమ్మెల్యే వేధిస్తున్నారని ఆరోపించారు. ఇటు నేరుగా మీడియానే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసింది. దీంతో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.మరోవైపు టీడీపీ వర్గాల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ కూడా ఆయన పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపింది. మూడున్నర నెలల్లోనే స్థానిక టీడీపీ శ్రేణులు కూడా ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ క్యాడర్ నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన అభిప్రాయాలు కూడా.. ఆయన వైఖరితో నియోజకవర్గంలో పార్టీ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తోందని వచ్చాయి.

## సస్పెండ్ దిశగా... కొలికపూడి

**గుంటూరు, సెప్టెంబర్ 30, పెన్ పవర్:** కృష్ణా జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అమరావతి ఉద్యమంలో ఫోకస్ అయిన దళిత నేత.. అమరావతి టాపిక్ వస్తే చాలు టీవీ డిబేట్లలో ప్రత్యక్షమవుతారు. గ్రీన్ కలర్ తలపాగా కట్టుకుని ఉద్యమ స్ఫూర్తి చూపిస్తూ చెలరేగేవారు .. అమరావతి రాజధాని పట్ల ఆయన నిబద్ధత చూసి తెలుగుదేశం పార్టీ ఏరికోరి టికెట్ ఇచ్చింది. తిరువూరు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో 1994 నుంచి నల్లగట్ల స్వామిదాసు టీడీపీకి పెద్ద దిక్కుగా ఉంటూ వచ్చారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. స్వామిదాసు గత ఎన్నికల ముందు కేశినేని నాని వెంట వైసీపీలో చేరడంతో టీడీపీకి అభ్యర్థి కరువయ్యారు.దాంతో ప్రస్తుత విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని తన అన్న నాని టీమ్‌ని ఓడించడానికి కొలికపూడి పేరు అధిష్టానానికి సిఫార్సు చేశారు. కొలికపూడ వాగ్ధాటి చూసి పార్టీకి పనికొస్తారని భావించి చంద్రబాబునాయుడు అతనికి టికెట్ ఇచ్చారు. కూటమి వేవ్‌లో కొలికపూడి మంచి మెజార్టీతో గెలిచారు. అమరావతి ఉద్యమనేతగా ఫోకస్ అయిన ఆయన్ని తిరువూరు ఓటర్లు అంతలా ఆదరిస్తే గెలిచాక ఆయన తనలోని మరోకోణం చూపిస్తున్నారంట. సమస్యలు చెప్పుకుందామని వెళ్లిన మహిళలను లైంగికంగా వేధింస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎమ్మెల్యే కొలికపూడి శ్రీను ఆగడాలు నియోజకవర్గంలో మితిమీరిపోయాయంటున్నారు. అధికారం చేతిలో ఉందికదా అని రెచ్చిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పేకాట శిబిరాల ఏర్పాటులో ఆయన ఎక్కువ వాటా డిమాండ్ చేస్తున్నారంట. ఒకవేళ ఇవ్వకుంటే భాగస్వామిపై కేసుల అస్త్రం ప్రయోగిస్తున్నారట. ఇటీవల చిట్టేల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావుపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడంతో మనస్థాపానికి గురైన ఆయన భార్య ఆత్మహత్యా యత్నం చేసి ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్నారు. అలానే ఎ.కొండూరుకు చెందిన ఒకరి దగ్గర ఎన్నికల కోసం కోటి రూపాయలు తీసుకున్న కొలికపూడి ఎమ్మెల్యే అయ్యాక కొలికపూడి రూ.20లక్షలు మాత్రమే ఇచ్చి దిక్కున్న చోటు చెప్పుకోమని అన్నారట.మహిళలు సమస్యలు చెబుదామని ఎమ్మెల్యే కొలికపూడి దగ్గరకు వెళితే వారిని లైంగికంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. దీంతో మహిళలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లాలంటే భయపడుతున్నారంట. ఎమ్మెల్యే ఆగడాలు మితిమీరడంతో ఇటు టీడీపీ కార్యకర్తల్లో అటు సామాన్య ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు .. వారంతా రోడ్డెక్కి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు.ఎమ్మెల్యే కొలికపూడిని వెంటనే సస్పెండ్ చేయాలని తిరువూరు టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఓట్లేసి గెలిపించుకున్న ప్రజలే ఇప్పుడు ఛీ ఆ ఎమ్మెల్యే మాకొద్దు .. అంటున్నారు. అసలు కొలికపూడి తమకు ఎమ్మెల్యేగా వద్దంటూ బాహాటంగానే చెప్పేస్తున్నారు. ఎమ్మెల్యే కొలికపూడిపై వచ్చిన లైంగిక ఆరోపణలపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడలో ధర్నా నిర్వహించి. తర్వాత మంగళగిరి టీడీపీ సెంట్రల్ ఆఫీసుకు వెళ్లి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడులను కలిసి ఫిర్యాదు చేశారు .. పార్టీకి నష్టం కలిగించడంతో పాటు కేడర్‌ని, ప్రజల్ని ఇబ్బంది పెడుతున్న ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఆ క్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి వివాదం టీడీపీ హైకమాండ్ వద్దకు చేరినట్లు తెలిసింది. అసలు ఆయన పనితీరు, ఆయన నియోజకవర్గం ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉన్నారు అనేదానిపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయసేకరణ చేసినట్లు చెప్తున్నారు. ప్రజలంతా కొలికపూడికి వ్యతిరేకంగా ఓటువేశారంట. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని చెప్పారంట. ఈ అభిప్రాయ సేకరణ అధినేత చంద్రబాబు వద్దకు చేరినట్లు తెలుస్తోంది. పార్టీ షోకాజ్ నోటీసులు కొలికపూడికి జారీచేసే అవకాశాలున్నట్లు సమాచారం. మరి చూడాలి ఈ ఎపిసోడ్ ఏ టర్న్ తీసుకుంటుందో?

# ఐదో స్థానంలో కోహ్లీ బ్యాటింగ్.. 11 ఏళ్ళ తర్వాత తొలిసారి



కాన్పూర్ టెస్టులో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ బ్యాటింగ్ స్థానం మారింది. సాధారణంగా నాలుగో స్థానంలో ఆడాల్సిన కోహ్లీ ఐదో స్థానంలో బ్యాటింగ్ కు దిగాడు. విరాట్ స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ బ్యాటింగ్ కు వచ్చాడు. అయితే దీనికి కారణం లేకపోలేదు. వర్షం కారణంగా తొలి మూడు రోజుల ఆటలో కేవలం 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మరో రెండో రోజులు ఆట మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో భారత్ ఫలితం కోసం వేగంగా ఆడుతుంది. దీంతో వేగంగా ఆడగలిగే పంత్ ను బ్యాటింగ్ ఆర్డర్ లో కోహ్లీ కంటే ముందుకు వచ్చాడు.

టీ విరామం తర్వాత శుభమాన్ గిల్ ఔట్ కావడంతో ఐదో స్థానంలో కోహ్లీ క్రీజ్ లోకి వచ్చాడు. చివరిసారిగా కోహ్లీ 2013లో వెస్టిండీస్ పై ముంబై టెస్టులో ఐదో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. సచిన్ టెండూల్కర్ కు ఇది చివరి టెస్ట్ మ్యాచ్. ఈ 11 ఏళ్లలో నైట్ వాచ్‌మెన్ మినహాయిస్తే తొలిసారి కోహ్లీ తన బ్యాటింగ్ స్థానాన్ని మార్చాల్సి వచ్చింది. టెస్ట్ క్రికెట్ లో పేలవ ఫామ్ తో ఇబ్బందిపడుతున్న కోహ్లీ ఈ మ్యాచ్ తో భారీ ఇన్నింగ్స్ ఆడాలని టీమిండియా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

ఈ మ్యాచ్ విషయానికి ప్రస్తుతం భారత్ తొలి ఇన్నింగ్స్ లో 22 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. కోహ్లీ (24), రాహుల్ (14) క్రీజ్ లో ఉన్నారు. భారత్ మరో 49 పరుగులు వెనకబడి ఉంది. చేతిలో ఆరు వికెట్లు ఉన్నాయి. 51 బంతుల్లోనే 72 పరుగులు చేసి జైశ్వాల్ టీ విరామానికి ముందు ఔటయ్యాడు. బంగ్లాదేశ్ తమ తొలి ఇన్నింగ్స్ లో 233 పరుగులకు ఆలౌట్ అయింది.

# ఇంగ్లండ్ రికార్డు బద్దలు కొట్టిన టీమిండియా

- కాన్పూర్ లో టీమిండియా ఐ బంగ్లాదేశ్ రెండో టెస్టు
- తొలి ఇన్నింగ్స్ లో 233 పరుగులకు ఆలౌట్ అయిన బంగ్లాదేశ్
- అనంతరం దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్
- 18 బంతుల్లోనే తొలి 50 పరుగులు చేసిన వైనం
- గతంలో ఇంగ్లండ్ పేరిట 26 బంతుల్లో 50 పరుగుల రికార్డు

కాన్పూర్ టెస్టులో టీమిండియా దూకుడుగా ఆడుతోంది. ఈ క్రమంలో ఇంగ్లండ్ రికార్డును బద్దలు కొట్టింది. ఆటకు నాలుగో రోజు కాగా, తొలి ఇన్నింగ్స్ లో బంగ్లాదేశ్ 233 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం, తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా అతి తక్కువ బంతుల్లోనే 50 పరుగులు చేసి రికార్డు సృష్టించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ చెలరేగడంతో టీమిండియాకు 18 బంతుల్లోనే 50 పరుగులు వచ్చాయి. గతంలో ఈ రికార్డు ఇంగ్లండ్ పేరిట ఉంది. ఇంగ్లండ్ 26 బంతుల్లో తొలి 50 పరుగులు చేసింది. ఇప్పుడా రికార్డును భారత జట్టు తిరగరాసింది.

రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ జోడీ తొలి వికెట్ కు 55 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ 11 బంతుల్లోనే 1 ఫోర్, 3 సిక్సర్లతో 23 పరుగులు చేసి మిరాజ్ బౌలింగ్ లో అవుటయ్యాడు.



ప్రస్తుతం టీమిండియా తొలి ఇన్నింగ్స్ స్కోరు 10 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 99 పరుగులు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 63, శుభ్ మాన్ గిల్ 11 పరుగులతో ఆడుతున్నారు.

# విరాట్‌దే వరల్డ్ రికార్డ్.. 27000 పరుగుల క్లబ్‌లో కోహ్లీ






బంగ్లాదేశ్‌తో కాన్పూర్ లో జరుగుతున్న టెస్టులో భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 27,000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. దీంతో అంతర్జాతీయ క్రికెట్ లో వేగంగా 27000 పరుగులు సాధించిన రికార్డ్ ను కోహ్లీ తన ఖాతాలో వేసుకున్నాడు. భారత తొలి ఇన్నింగ్స్‌లో 25వ ఓవర్‌లో 35 పరుగుల వద్ద కోహ్లీ ఈ మైలురాయిని చేరుకున్నాడు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్ గా కోహ్లీ నిలిచాడు. ఓవరాల్ గా ఈ ఫీట్ సాధించిన నాలుగో బ్యాటర్ కోహ్లీ. సచిన్ టెండూల్కర్ తో పాటు కుమార సంగక్కర, రికీ పాంటింగ్‌లు ఈ జాబితాలో ఉన్నారు.

ఈ టెస్టు మ్యాచ్ లో టెస్టులో కోహ్లీ 47 పరుగులు చేసి ఔటయ్యాడు. 35 బంతుల్లో 4 ఫోర్లు.. ఒక సిక్సర్ తో మంచి టచ్ లో కనిపించిన విరాట్ వేగంగా ఆడే క్రమంలో షకీబ్ బౌలింగ్ లో బౌల్డయ్యాడు. దీంతో కనీసం అర్ధ సెంచరీ సాధిస్తాడనుకున్న ఫ్యాన్స్ కు నిరాశ తప్పలేదు. ప్రస్తుతం భారత్ 30 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. 51 బంతుల్లోనే 72 పరుగులు చేసి జైశ్వాల్ టీ విరామానికి ముందు ఔటయ్యాడు. కోహ్లీ (47), గిల్ (39) రాణించారు. ప్రస్తుతం భారత్ 15 పరుగుల ఆధిక్యంలో ఉంది.

## మచ్చలేని పూల చీరలో వాణి కపూర్



# సమంత వాచ్ ధర ఎంతంటే?



సమంత స్టైలిష్ డిజైనర్ దుస్తుల్లో కనిపించడం రేర్. ఫోటో షూట్లు ఉంటే? తప్ప స్టైలిష్ ఎంపికల జోలికి వెళ్లదు. కానీ తనలో అంతకు మించిన ఫ్యాషన్ క్వాలిటీని మాత్రం ప్రతీ సందర్భంలో హైలైట్ చేస్తుంటుం ది. అందులో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును చాటుతుంది. సాధారణ దుస్తుల్లోనే తనలో ఫ్యాషన్ క్వాలిటీని హైలైట్ చేయడంలో సామ్ ప్రత్యేకం. తాజాగా అమ్మడు న్యూ అరైవల్స్ లో ఇలా మెరిసింది. పాస్టెల్ గ్రీన్ కో ఆర్డ్ సెట్ డిజైన్ లో ఆకర్షణీయంగా ముస్తాబైంది. డ్రెస్ మ్యాచింగ్ యాక్సరసీస్ ని ఎంపిక చేసుకుంది. అమ్మడి మ్యాకప్ అలంకరణ ఆకట్టుకుంటుంది. చెవులకు బంగారు పోగులు ధరించింది. ఇక చేతికి అమ్మడు ఖరీదైన వాచ్ ని ధరించింది. విలాసవంతమైన బల్గారీ రసర్పెంటీ వాచ్ ధరించింది. ఆ వాచ్ చేతిని మరింత అందంగా తీర్చి దిద్దింది. దీని ధర భారీగా ఉంటుందని నెటిజనులు గెస్ చేస్తున్నారు. ధర ఎంత అనే దానిపై సెర్చింగ్ సాగుతోంది. అంచనాల ప్రకారం ధర 45 లక్షలకుపైగానే ఉంటుందని సమాచారం.ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అభిమానులు సమంత బ్యూటీకి ఫిదా అవుతున్నారు. సమంత రూప లావణ్యంలో ఎలాంటి మార్పులు రాలేదని..మునుపటి అందాన్ని మెయింటెన్ చేస్తుందని ఓ అభిమాని పోస్ట్ పెట్టాడు. ఇక సమంత కెరీర్ ని మళ్లీ బిజీగా మార్చే పనిలో ఉంది. త్వరలోనే %-%సీటాడెల్%-% ఇండియన్ వెర్షన్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే కొత్త సినిమాలకు రెడీ అవుతుంది. కొంత కాలంగా బాలీవుడ్ లో ఉండి అక్కడ నుంచి యాక్టివిటీస్ అన్నింటిని కొనసాగిస్తుంది.

## రలతో పాయల్ ప్రేమ వ్యవహారం



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com